క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ నిర్వహణ వారోత్సవాల సందర్భంగా ఈనెల 10 నుంచి 12వరకు ఆదిలాబాద్ పట్టణంలోని పలు ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 10న సప్తగిరి కాలనీ ఫీడర్‌లో, 11న కలెక్టర్ చౌక్ ఫీడర్, 12న ఆదిలాబాద్ టౌన్ -6 ఫీడర్‌లో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రతీ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలి

బోథ్: ప్రతిఒక్కరూ పక్షుల కోసం నీటి తొట్టిలు, ఆహారం కోసం బర్డ్ ఫీడర్‌లను ఏర్పాటు చేయాలని పక్షి ప్రేమికుడు వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రకృతితో స్నేహం కార్యక్రమంలో భాగంగా పక్షుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, మాధవి, లింగంపల్లి సంతోష్ కుమార్, మంత్రి శ్యామ్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్ట్

బోథ్: కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రగతిభవన్ ముట్టడికి తరలుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను సోమవారం బోథ్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. అరెస్టయిన వారిలో జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జైనథ్: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల పక్షం రైతు సంఘం నాయకులు దారట్ల కిష్టు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని భోరజ్, బాలాపూర్, సావాపూర్, లేకర్‌వాడ, పెండల్‌వాడ గ్రామాల్లో పర్యటించారు. రైతులతో సమావేశమై గిట్టుబాటు ధర కోసం చేస్తున్న పోరాటంలో ప్రతిఒక్కరూ కలిసి రావాలని కోరారు. ఆయన వెంట నాయకులు రమేష్, నారాయణ, పోశెట్టి, లక్ష్మణ్, దేవిదాస్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

మన్యాపూర్‌లో పూజలు

నార్నూర్: మండలంలోని మాన్యాపూర్ గ్రామంలో ఆదివాసీ గిరిజనులు జైజంగు.. జై లింగు.. జై శంభు మహాపూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. మెస్రం ప్రభుదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో అంబదేవి ఆలయంలో సంస్కృతి, సాంప్రదాయాలతో పూజలు చేశారు. పీఠాధిపతి భగవంత్‌రావు పటేల్ మాట్లాడుతూ.. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జైజంగు.. జైలింగు రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, ఆత్రం రాంశాఉమహరాజ్, మాడవి రాజేశ్వర్, గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, రాయిసీడం రూప్‌దేవ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఉట్నూర్‌రూరల్: బడీడు పిల్లలు బడిలో చేరాలని సీఆర్పీ ధరంసింగ్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వే నిర్వహించి 12 మంది బడీడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించడం జరిగిందన్నారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6, 14 సంవత్సరాల పిల్లలు బడిలో ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బడి బయట పిల్లల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. సర్వేలో మండల సీఆర్పీలు భీర్షావ్, రాందాస్, నరేశ్, ఇంద్రు, సుకన్య, రమేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని రాజుర, బందంరేగడి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం సాధించడమే వంచిత బహుజన అఘాడి పార్టీ లక్ష్యమని రాష్ట్ర ఇన్‌చార్జి చౌదంతే కమలేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. మిలింద్‌నగర్, బుద్ధవిహార్‌ను సందర్శించి అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సదీప్, నాగసేన్, విద్యాసాగర్, శ్రీకాంత్, మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే, కామరాజ్, గౌతం, దీలిప్, భారత్, మధుకర్, బాబా పాల్గొన్నారు.

నీటి వృథాకు చెక్

- భీంపూర్ మండలంలో పూర్తయిన రెండు చెక్‌డ్యాంలు
- పెరిగిన భూగర్భజలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కరంజి(టి) వద్ద పూర్తయిన చెక్‌డ్యాం

తాంసి: ప్రతిఏడాది వర్షాకాలంలో వరద నీరు ప్రవహించి, పెన్‌గంగలో కలుస్తుంది. దీంతో నీటి వృథాకు చెక్ పెట్టేందుకు భీంపూర్ మండలంలోని పలు గ్రామాల శివారులో చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత రెండేళ్ల క్రితం జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణాలకు నిధులు సైతం మంజూరు చేసింది. మండలంలోని కరంజి(టి), గుంజాల, ధనోరా గ్రామాల వాగులపై చెక్‌డ్యాం నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ధనోరా గ్రామ శివారులోని వాగుపై నిర్మించే చెక్‌డ్యాం నిర్మాణానికి స్థలం దొరకక ఇతర స్థలానికి మార్చడంతో పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కరంజి(టి), గుంజాల గ్రామాలలో నిర్మించిన చెక్‌డ్యాంల నిర్మాణ పనులు పూర్తయితే వరదనీరు వృథా పోకుండా నిలుస్తుంది.

మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.5 కోట్లు..

భీంపూర్ మండలంలోని మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం దాదాపుగా రూ.5కోట్ల నిధులు మంజూరు చేసింది. కరంజి(టి) చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.1.64 కోట్లు, గుంజాల చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.1.34 కోట్ల నిధులతో పాటు ధనోరా చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.1.80 నిధులను కేటాయించింది. కరంజి(టి) చెక్‌డ్యాం ద్వారా 200 ఎకరాల ఆయకట్టు, గుంజాల చెక్‌డ్యాం ద్వారా 150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులు ప్రారంభించారు. ధనోరా వద్ద నిర్మించే చెక్‌డ్యాం డిజైన్‌తో పాటు లోకేషన్ మార్చడం, స్థానిక రైతులు నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వకపోవడంతో పనులలో జాప్యం జరిగి ప్రారంభించ లేదు. రైతులు, గ్రామస్తులు ముందుకు వచ్చి స్థలం ఇవ్వడంతో పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కరంజి(టి), గుంజాల చెక్‌డ్యాం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.

పంటలకు సరిపడా సాగునీరు..

చెక్‌డ్యాం నిర్మాణంతో కరంజి(టి), ఇంద్రనగర్, గుంజాల గ్రామాల శివారులోని పంటచేన్లలో భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగాయి. బోరుబావులలో, తాగునీటి బావులలో నీటిశాతం పెరిగింది. రైతులు రబీలో సాగుచేసే పంటలకు సైతం సాగునీరు అందుతుంది. చెక్‌డ్యాం నిర్మాణం లేక ఇన్నాళ్లు సాగునీరు అందక పంటలు వేయలేని రైతులు రబీలో సైతం సాగు చేసేందుకు ముందుకువస్తున్నారు. చెక్‌డ్యాం నిర్మాణాలు పూర్తి కావడంతో నీరు వృథాగా పోకుండా నీటి లభ్యత ఉండడంతో ఆయా గ్రామాల లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పుష్కలంగా సాగునీరు



వర్షాకాలంలో వరదనీరు వృథాగా పెన్‌గంగలో కలిసేది. వాగులో నీరు నిల్వ ఉండేది కాదు. వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులకు విన్నవించడంతో నిర్మాణం చేపట్టారు. చెక్‌డ్యాం నిర్మాణంతో డ్యాం కింద ఉన్న రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుంది.

– బక్కి సతీష్ యాదవ్, కరంజి(టి)

పనులు పూర్తయ్యాయి

మండలంలోని కరంజి(టి), గుంజాల గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మించడంతో శివారు ప్రాంతం జలకళను సంతరించుకుంది. ఇప్పటికే కరంజి, గుంజాల చెక్‌డ్యాం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగిలిన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయి.

– మాలిక, ఏఈ నీటిపారుదల శాఖ

కడుపునొప్పితో విద్యార్థి మృతి



తొడసం రాజు (ఫైల్)

ఇంద్రవెల్లి: కడుపునొప్పి, వాంతులతో ఇంటర్ విద్యార్థి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని వడగామ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండగూడ గ్రామానికి చెందిన తొడసం రాము, హీరబాయి దంపతుల కుమారుడు తొడసం రాజు (18) ఉట్నూర్ మండల కేంద్రంలోని శ్రీ పూలాజీబాబా కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామ యువకులతో కలిసి అడివికి వెళ్లి వచ్చాడు. రాత్రి భోజనం చేసి పడుకున్న సమయంలో కడుపునొప్పి, వాంతులు అవుతున్నాయని కుటుంబసభ్యులకు తెలిపారు. వారు ఇంట్లో ఉన్న కడుపు నొప్పి మాత్రలు ఇచ్చారు. తెల్లవారుజామున నొప్పి ఎక్కువవడంతో ఆటోలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో జెండగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆశాజనకంగా శనగ సాగు

- 20 వేల ఎకరాల్లో పంట
- పెరిగిన సాగు విస్తీర్ణం
- ఫిబ్రవరి మొదటి వారం నుంచి కోతలు



జైనథ్‌లో సాగు చేస్తున్న శనగ

జైనథ్: మండల కేంద్రంలో శనగ సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈఏడాది యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున శనగ సాగుపై దృష్టి సారించారు. మండలంలో ప్రతీ ఏడాది యాసంగి సాగు పెరుగుతుంది. గత ఏడాది 18వేల ఎకరాల్లో మాత్రమే శనగ సాగైంది. సాగునీరు లభ్యత ఉండడంతో ఈఏడాది మాత్రం మరో 2 వేల ఎకరాలు పెరిగి 20వేల ఎకరాల్లో శనగ సాగులోకి వచ్చింది.

పెరిగిన యాసంగి సాగు..

గతంలో మండలంలో రైతులు ఎక్కువగా వానాకాలం పంటలపైనే దృష్టి సారించేవారు. దీంతో పత్తి, సోయా వంటి పంటలు మాత్రమే పండేవి. కానీ గత కొన్ని సంవత్సరాలు మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్, లక్ష్మీపూర్ రిజర్వాయర్ నీరు సకాలంలో అందుతుండడంతో పాటు చేన్లలో బోర్లు విరివిగా అందుబాటులోకి రావడంతో యాసంగి సాగు పెరుగింది. 2014లో కేవలం 5– 8వేల ఎకరాలకు పరిమితమైన శనగ ప్రస్తుతం 20వేల ఎకరాలకు చేరుకొంది. శనగకు మంచి డిమాండ్ ఉండటం, మార్కెట్ కూడా అందుబాటులో ఉండడంతో రైతులు శనగ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం శనగ ఆశాజనకంగా ఉంది.

శనగపైనే ఆశలు..



ఈఏడాది పత్తి అంతగా కలిసి రాలేదు. దిగుబడి కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. దీనికి తోడు పత్తి ధర కూడా ఆశించి న స్థాయిలో లేకపోవడంతో శ నగపైనే ఆశలు పెంచుకోవడం జరిగింది. పది ఎకరాల్లో శనగ సాగు చేశా. ఇప్పటికే పూత దశకు చేరుకుంది. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాను.

– కాంబ్లే ఆనంద్ రావ్, రైతు, లక్ష్మీపూర్

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రస్తుతం మండలంలో శనగ సాగు బాగుంది. అక్కడక్కడ కాండం తొలుచు, వేరుకు కు ళ్లు తెగులు కనిపిస్తుంది. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు పాటించాలి.

– వివేక్, మండల వ్యవసాయాధికారి

జాతీయ బంజారా దీక్షభూమి వద్ద పూజలు



పూజలు చేస్తున్న గురువు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద సోమవారం దీక్ష గురువు శ్రీ సద్గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంబాడా జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడు రోజుల జాతరను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 11న దీక్ష భూమి వద్ద నిర్వహించే గురుకృపా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో మార్పుతోపాటు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, జేఏసీ నాయకులు డాక్టర్ నారాయణ్, రెడ్డినాయక్, పవార్ దేవిదాస్, రాథోడ్ రామేశ్వర్ ఠాక్రునాయక్, చౌహాన్ యశ్వంతరావు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఎస్టీయూ క్యాలెండర్‌ను సోమవారం ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిలేశ్ చౌహాన్, రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు శీతల్, వామన్‌రావు, ఆత్మరాం పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలి

కైలాస్‌నగర్: మావల మండల శివారులోని సర్వేనెం. 170లో జారీ చేసిన పట్టాలపై విచారణ జరిపి అనర్హులను తొలగించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్‌కుమార్, అధికార ప్రతినిధి నక్క రాందాస్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు, 1200 మందికి ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు జారీ చేసిందన్నారు. కాని కొంతమంది అక్రమార్కులు డూప్లికేట్ పట్టాలు సృష్టించి 3000 ఇళ్ల నిర్మించుకున్నారని ఆరోపించారు.

వైద్యాధికారులకు సన్మానం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లుగా భీంరావ్, అలేఖ్య, శ్రావ్యవాణి విధుల్లో చేరారు. వారిని సోమవారం జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో ఆప్తల్మిస్ట్ భాస్కర్, సర్పంచ్‌లు మడవి ప్రకాష్, యాదవ్‌రావ్, మారుతి, శంకర్, సుభాష్, వైద్య సిబ్బంది దేవిదాస్, రమేష్, అశోక్, నవీన్, రాజు, రాజారాం పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాజేశ్వర్

ఆదిలాబాద్‌రూరల్: ఆర్యవైశ్య సంఘం ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడిగా కొత్తవార్ రాజేశ్వర్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవీ కోసం రాజేశ్వర్‌తో పాటు జనగం సంతోష్, ఉపలంచివార్ కృష్ణ, మల్లువార్ చంద్రకాంత్ పోటీపడ్డారు. ఈ ఎన్నికలో 1003 ఓట్లు సాధించిన రాజేశ్వర్, చంద్రకాంత్‌పై 325 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. కులస్తులు, నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణధికారి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్‌లు గంగాధర్, లూసి, శ్రీదేవి, అశోక్, జానాబాయ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల(కె)లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కుంటాల సర్పంచ్ అశోక్, నేరడిగొండ ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, నాయకులు బిక్కు, చందర్, సంతోష్, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్పీటీసీ

బజార్‌హత్నూర్: ఈనెల 13, 14న రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని మండల ప్రధాన కార్యదర్శి కాంబ్లే విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం దేగామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య చేతుల పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంఈవో శ్రీకాంత్, కంటే రాజశేఖర్, సంతోష్, మీనాక్షి, గంగాధర్, పుండలిక్ చంద్రశేఖర్, శ్రీనివాస్, సుకుమార్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్



నేరడిగొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల నుంచి తాగునీటిని తెప్పించి విద్యార్థినులకు అందించాల్సిన దుస్థితి నెలకొంది. కేజీబీవీలో నిర్వహణ సరిగా లేకపోవడంతోనే వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు నోచుకోవడం లేదు.

– సంబంధిత అధికారి: ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి, ఫోన్: 94922 80942

బహిరంగ ధూమపానం నేరం



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పొగాకు నియంత్రణ బృందంతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణ ప్రాంగణాల పరిధిలో ధూమపానం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులు నమిలి ఉమ్మడం, బహిరంగ ధూమపానం చేయరాదని అవగాహన కల్పించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు చిరంజీవి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగ జాతర ప్రారంభం



నదీ తీరంలో ప్రతిష్ఠించిన రథం

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగ నది ఒడ్డున కొలువుదీరిన రామనంద్, మాధవ్‌రావ్ మహారాజ్ ఆలయ జాతర సోమవారం ప్రారంభమైంది. మహారాష్ట్రలోని పాఠన్‌బోరిలోని రామనంద్, మాధవ్‌రావ్ మహారాజ్ సంస్థాన్ సభ్యులు పాదుకులతో పాదయాత్రగా నదికి చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, రథాన్ని ప్రతిష్ఠించారు. రథానికి పూజలు నిర్వహించి, దహికాల హండీ నిర్వహించారు. గంగ నదికి పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. భజన పాటలు పాడుతూ.. రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నదీ తీరంలో దుకాణాలు వెలిశాయి. ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

సమాచారం

11 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 11 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కొంగర్ల ప్రశీత్ యాదవ్ తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు. క్రీడాకారులు రూ.500 ఎంట్రీ ఫీజ్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

11న మండల సర్వసభ్య సమావేశం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 11న ఉదయం 11 గంటలకు ఎంపీపీ అజాడే జయశ్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చౌహన్ రాధ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పరిహారం చెల్లించాలి

బజార్‌హత్నూర్: ఖరీఫ్ సాగులో విత్తిన విక్రాంత్, కరీష్మా కంపెనీలకు చెందిన సోయబీన్ విత్తనాలు మొలవకపోవడంతో రైతులు నష్టపోయారని, సంబంధిత కంపెనీల నుంచి నష్టపరిహారం అందించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మండల రైతులు ఫిర్యాదు చేశారు. రైతు లక్కం శంకర్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో దుక్కిదున్ని, చదును చేసి రసాయనిక ఎరువులు వేసి వేల ఖర్చు పెట్టి విత్తనాలు కొనుగోలు చేసి విత్తినా.. అవి మొలవక నట్టేట్ట మునిగామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సంగు నరేందర్, దన్గరి వెంకటేష్, కొంగర్ల కాశీరాం, గిద్ది శంకర్, దీషి పోశెట్టి పాల్గొన్నారు.



చలి తగ్గాలి.. చదువు సాగాలి

ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం చలి వణికిస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్ నెంబర్ వన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చలిని తట్టుకోలేక పాఠశాల ఆవరణలో ఎండకు కూర్చుని పాఠాలు వింటున్నారు. ఈదృశ్యాన్ని సోమవారం సాక్షి, క్లిక్ మనిపించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్